ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప

జిల్లా వార్తలు

1

ఆదివారం 4 మే 2025

మహానాడు స్థల వేదిక ఖరారు

- టీడీపీ బృందం పరిశీలన
- నేటి నుంచి ముమ్మరంగా పనులు

(కడప - ఆంధ్రజ్యోతి): కడపలో టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మహానాడు కార్యక్రమ నిర్వహణ పనులు ఇక ముమ్మరం కానున్నాయి. ఈ నెల 27, 28, 29 తేదీలలో మహానాడు నిర్వహించనున్నారు. అయితే ఇప్పటి దాకా స్థల ఖరారుపై పీటముడి ఉండేది. అయితే మహానాడును సీకేదిన్నె మండలంలోని జయరాజ్‌గార్డెన్ సమీపంలోని 120 ఎకరాల్లో నిర్వహించాలని నిర్ణయించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. కడపలో మహానాడు నిర్వహించాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నిర్ణయించారు. అయితే స్థలం ఎంపిక ప్రతిష్టాత్మకంగా మారింది. ఎయిర్‌పోర్టు సమీపం, జయరాజ్‌గార్డెన్ సమీపం, ఎన్జీవో ప్లాట్ల స్థలాలలో ఎక్కడో చోట నిర్వహిం చాలనుకున్నారు. టీడీపీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఎన్జీవో ప్లాట్లలో నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. అయితే కమిటీ మూడు స్థలాలను పరిశీలించింది. శనివారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వెంకట సత్యనారాయణరాజు, ఏపీ మారిటోరియం బోర్డు ఛైర్మన్ దామచెర్ల సత్య, టీడీపీ రాష్ట్ర కార్యానిర్వహణ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి కార్యదర్శి హేమ బందర్‌రావు , డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ స్థలాలను పరిశీలించారు. జయరాజ్‌గార్డెన్ సమీపంలోని 120 ఎకరాల స్థలాన్ని ఖరారు చేసినట్లు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. ఆదివారం నుంచి ఇక్కడ జంగిల్ క్లియరెన్స్ చేయనున్నారు.

25వేల మంది ప్రతినిధులు రాక

ఈనెల 27, 28, 29 తేదీల్లో మహానాడు నిర్వహిస్తారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు కర్ణాటక అండమాన్ నికోబార్ దీవులతో పాటు విదేశాల నుంచి సుమారు 25వేల మంది టీడీపీ నేతలు హాజరు కానున్నారు. తొలి రెండు రోజులు ప్రతినిధుల సభ సాగు తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు నారా లోకేశ్‌తో పాటు పముఖ పార్టీ శ్రేణులంతా హాజరు కానున్నారు. 29న బహిరంగసభ నిర్వహిస్తారు.

వసతులు ఏర్పాటు

మహానాడుకు వచ్చే పార్టీ నేతల బస చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, రాయచోటి, రాజంపేట, ఇలా చుట్టూ 50 కి.మీ పొడవునా హోటల్స్ కళ్యాణ మండపాలు, గెస్టహౌస్‌లు, ప్రైవేటు విద్యాసంస్థల హాస్టల్స్ అన్నింటినీ బుక్ చేశారు. ఇక స్థలం ఖరారు కావడంతో మహానాడుకు ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.



జయరాజ్‌గార్డెన్ సమీపంలో స్థలం పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

రూ.30కోట్ల చెరువు భూమి

కబ్జా కహానీలో..

- మూడు శాఖల సహకారం
- తెర వెనుక సూత్రధారులు
- తెర ముందు పాత్రధారులు
- పదిరోజుల ముందే కబ్జా స్క్రిప్ట్ సిద్ధం
- వాటాల్లో తేడాతో కబ్జాల వ్యవహారం బట్టబయలు..?



ఆక్రమణకు గురైన పాతకడప చెరువు



(కడప - ఆంధ్రజ్యోతి): ఒక సినిమా తీయాలంటే కథ ఒకరు రాస్తే.. డైరెక్షన్ మరొకరు చేస్తారు. ఇక సినిమా నిర్మాణంలో కీలకమైన పెట్టుబడిని నిర్మాత పెడుతుంటారు. ఇది సినిమా తీసే విధానం, అయితే అచ్చం సినిమా స్టోరీని తలదన్నే విధంగా కడప నగరంలోని పాతకడప చెరువు భూమి అన్యాక్రాంతంలో జరిగినట్లు చెబుతారు. స్థల ఆక్రమణకు ఓ బ్యాచ్ స్క్రిప్ట్ తయారు చేస్తే... ఎవరూ అడ్డుపడకుండా ఉండేందుకు మేనేజ్ చేసేందుకు అవసరమైన నిధులను ఓ నేత పెట్టుబడి పెట్టారంటారు. ఇక ఈ కబ్జాకు సంబంధించి స్క్రిప్ట్‌లో భాగంగా పదిరోజుల క్రితమే ఓ ఇద్దరు అధికారులను ఓ నేత పిలిపించి అక్కడ మనోళ్లే వెంచర్ వేస్తారు. మీరు పట్టించుకో వద్దంటూ అదృశ్య వ్యక్తి చెప్పినట్లు సమాచారం. ఇలా కబ్జాకు అవసరమైన స్క్రిప్ట్ అంతా రెడీ కావడంతో గుట్టుచప్పుడు కాకుండా చెరువు ఆక్రమణకు సిద్ధపడ్డారు. అయితే వాటాల్లో తేడా రావడంతో ఓ బ్యాచ్ రగిలిపోతూ విషయాన్ని పెట్టడం.. చెరువు అన్యాక్రాంతంపై రైతులు రెవెన్యూకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవ హారానికి ఫుల్‌స్టాప్ పడింది. సుమారు రూ.30కోట్లు విలువ చేసే రెవెన్యూస్థలం అన్యాక్రాంతం కావడంలో రెవెన్యూ, కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్, మత్స్యశాఖ అధికారులు పూర్తిగా సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి.

కడప నగరంలోని పాత కడప చెరువు సుమారు 465 ఎకరాల విస్తీర్ణం ఉంది. దేవుని కడప, మోడమీదపల్లె, పాలెంపల్లె, రూకవారిపల్లె, సాయిపేట, అక్కాయపల్లె, నానాపల్లె పరిధిలోని సుమారు 2వేల ఎకరాలకు ఈ చెరువు ద్వారా సాగునీరు అందుతుంది. చెరువు పక్కనే మత్స్యశాఖ కార్యాలయం, కాలేజీ ఇతర కట్టడాలు ఉన్నాయి. ఇక్కడ సెంటు రూ.10లక్షల పైమాటే ఉంది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవుని కడప కూడా దగ్గరగా ఉండడంతో ఈప్రాంతంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తున్నారు. దీంతో ఇక్కడ నివాస స్థలాలకు మంచి డిమాండ్ ఉంది.

ఖాళీ స్థలంపై కన్ను

పాతకడప చెరువు పక్కనే స్థలాలకు మంచి డిమాండ్ ఉంది. చెరువుకు ఇరువైపులా విలువైన భూమి అన్యాక్రాంతమైంది. దీంతో ఏటా చెరువు విస్తీర్ణం కుచించుకుపోతూ వస్తోంది. చెరువును సర్వే చేసి హద్దులు కనబరచాలంటూ ఎప్పటి నుంచో రైతులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అయితే అటు రెవెన్యూ, ఇటు ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. ఈ నేపధ్యంలో చెరువు సమీపంలోనే సుమారు ఐదు ఎకరాల దాకా చదను చేశారు. వెంచర్ వేసేందుకు అవసరమైన మట్టి, గ్రావెల్‌ను సిద్ధం చేశారు. చెరువు భూమి అన్యాక్రాంతమవుతోందంటూ నీటి సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. 1927 సంవత్సరం నాటి డాక్యుమెంట్లను తీసుకువచ్చారు. 3980/1927-లో 1.54 సెంట్లు, 1782/1942లో 12 సెంట్లు, 282/1962లో 1.46 సెంట్లు చొప్పున ఓ డాక్యుమెంట్లు ఉన్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. అయితే డాక్యుమెంటున్న పేర్లకు ఆర్ఎస్ఆర్‌లోని పేర్లకు సేమ్ టు సేమ్ పేర్లు లేవు. దీంతో ఇది చెరువు భూమి అనే రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మూడు శాఖల సహకారం

పాత కడప చెరువు స్థలం అన్యాక్రాంతం వెనక మూడు శాఖలలోని కొందరు అధికా రుల సహకారం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఈ చెరువు పక్కనే సర్వే నెం.460లో మత్స్యశాఖ స్థలం కూడా ఉంది. రేయింబవళ్లు మత్స్యశాఖ కార్యాలయంలో నుంచే గ్రావెల్, మట్టిని తరలించినా కూడా ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇక్కడి అధికారులు బాగా సహకరించారనే చర్చ నడుస్తోంది. 25 హెక్టార్లు దాటిన చెరవు సమీపంలో 30 అడుగుల లోపు ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేవు. పాతకడప చెరువు 465 ఎకరాల్లో విస్తీర్ణం ఉంది. అంటే ఇక్కడ వంద మీటర్ల వరకు నిర్మాణాలు అనుమతించరు. పట్టాభూమి అయినా సరే కేవలం పంటల సాగు మాత్రమే చేసుకోవాలి. అయితే ఇక్కడ వెంచరు వేసేందుకు లెవలింగ్ చేసి పనులు చేస్తున్నా కూడా కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ కళ్లు లేని కబోధిలా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. టౌన్‌ప్లానింగ్‌లో ఓ సారుపై అవినీతి ఆరోపణలు భారీగా ఉన్నాయి. అందుకే వెంచరు గురించి తెలిసినా పట్టించుకోలేదంటారు. వారం రోజు లుగా కడపలోనే చెరువు వద్ద వెంచరు వేస్తూ మట్టి తోలి గ్రావెల్ తోలుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం ఇక్కడ ఓ అధికారి పూర్తిగా సహక రించారనే చర్చ ఉంది. ఇలా మూడుశాఖల అధికారులు సహకారంతోనే అన్యా క్రాంతానికి బీజం పడిందని చెబుతారు.

అదృశ్య వ్యక్తి అభయం

ఈ అన్యాక్రాంతం స్కెచ్ వెనుక పదిరోజుల కిందటే బీజం పడిందంటారు. తెర వెనక అదృశ్య వ్యక్తి టౌన్‌ప్లానింగ్, కీలక అధికారులను పిలిపించి మనోళ్లు వెంచరు వేస్తారు. మీరు ఏదైనా ఫిర్యాదు వచ్చినా పట్టించుకోవద్దని చెప్పినట్లు సమాచారం. ఆ అదృశ్య వ్యక్తి అభయం ఇవ్వడంతోనే చెరువు అన్యాక్రాంతానికి స్కెచ్‌లు అమలు చేశారనే ప్రచారం ఉంది.

సర్వే చేస్తేనే...

పాతకడప చెరువు ఇరువైపులా అన్యాక్రాంత మైందని.. సర్వే చేయాలని రైతులు ఎన్నో రోజుల నుంచి డిమాండ్ చేస్తున్నారు. సర్వే చేస్తే ఇప్పుడు వేస్తున్న వెంచరు చెరువు పొలంలోనా, లేక పట్టాభూములోనా అని తెలిసిపోతుంది. అప్పుడు చెరువు స్థలం ఎన్నిఎకరాలు అన్యాక్రాంతానికి గురైందనే గుట్టు వీడు తుంది.

ఎర్రచందనం రవాణాలో పెద్దల హస్తం

- డీఎఫ్‌వో వినీత్‌కుమార్



దుంగలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

ఒంటిమిట్ట, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం అక్రమ రవాణాలో పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తోందని కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం పట్టుబడిన ఎర్రచందనం దుంగల స్మగ్లింగ్‌లో 7 నుంచి 8 మంది వ్యక్తుల ప్రమేయం ఉంటుందని, దొరికిన సెల్‌ఫోన్లకు కాల్స్ వస్తున్నాయని, ఇందులో బెంగళూరు, మదనపల్లె ప్రాంతాలకు చెందిన పెద్దల హస్తం ఉండవచ్చునన్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఒంటిమిట్ట చెరువు కట్టపై అనుమానాస్పదంగా క్యాబేజీ లోడుతో వెళుతున్న ఐచర్ వాహనాన్ని వెంటాడి ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఇందులోని ఇద్దరు వ్యక్తులు పరారయ్యారని, రెండు సెల్‌ఫోన్లు, 84 దుంగలు, ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. సెల్‌ఫోన్ ఆధారంగా అన్నమయ్య జిల్లా రేగల్లు మండలం బోయనపల్లె గ్రామానికి చెందిన మురళిని గుర్తించామన్నారు. అతడి కోసం ప్రత్యేక టీములను మదనపల్లె, పీలేరు ప్రాంతాలకు పంపామన్నారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో వివేకానంద, డీఆర్వో నాగునాయక్, సిబ్బంది శ్రీనివాసులు, సుబ్రమణ్యం, సుధాకర్, ఇందిర, ఆంజనేయులు, నాయక్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలకు సర్వం సిద్ధం

- 8 సెంటర్లు, 2428 మంది విద్యార్థులు
- టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్-2025) ఈనెల 4వ తేదీ ఆదివారం నిర్వహించడానికి జిల్లాలో సర్వం సిద్ధం చేశామని.. తొలిసారిగా జిల్లాలో జరిగే ఈ పరీక్షలను విజయవంతం చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం నీట్ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లా డుతూ ఎన్టీఏ నియమ, నిబంధనలు తప్పక అమలు చేయాలన్నారు. కట్టుదిట్టమైన బందో బస్తు నడుమ 144 సెక్షన్ అమలు పరీక్ష నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం ఉండకూడదన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఏఎన్ఎం, మెడిసన్, 108 వాహనం అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక డిప్యూటీ కలెక్టర్‌ను ఇన్‌చార్జిగా నియమించామన్నారు. జిల్లాలో మొత్తం 8 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రొద్దుటూరులో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు, కొత్రపాడు వద్ద గల వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ, కడప నగరం నాగరాజు పేటలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాల, పెద్ద పోస్టాఫీసు వద్ద గల ప్రభుత్వ బాలికల కళాశాల, మున్సిపల్ మెయిన్ స్కూల్, పీఎం కేంద్రీయ విద్యాలయం, చిన్నచౌకులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, ఎన్జీవో కాలనీలోని జడ్పీహెచ్ హైస్కూలులో పరీక్షలు జరుగుతాయన్నారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు మాత్రమే విద్యార్థులకు పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరు గుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం అన్ని డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సాంప్రదాయ పద్ధతిలో డ్రస్‌కోడ్ పాటించాలన్నారు. నీట్ పరీక్ష-2025కు సంబంధించి విద్యార్థులకు ఎటువంటి సమచారం కావాలన్నా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబరు 08562-246344ను సంప్రదించాలని తెలిపారు.

నత్తే నయం

- ఆది నుంచి అవరోధమే
- నాశిరకంగా రోడ్డు నిర్మాణ పనులు
- అవస్థలు పడుతున్న ప్రజలు



4 నాసిరకంగా పనులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో రోడ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన కోసం అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అల సత్వం కనిపిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నగరంలోని మహిళా ప్రాంగణం నుంచి నుంచి ఎస్‌బీఐ కాలనీ వరకు రూ.50 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ పనులు మొదలుపెట్టి దాదాపు రెండు నెలలకు పైగా సమయం పడుతున్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టరు త్వరితగతిన పనులు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతు న్నారు. అక్కడున్న గృహాలకు ఈ రోడ్డే ఆధారం. రోడ్డు పనులు నత్తనడకన సాగుతుం డడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లాలన్నా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి.

ఆది నుంచి అవరోధాలు

ఈ రోడ్డు పనులకు సంబంధించి మొదటి నుంచి అవరోధాలు ఎదురవుతున్నట్లు తెలుస్తుంది. గతంలో సాయి ప్రవీణ్‌చంద్ కమిషనరుగా ఉన్న సమయంలో ఈ పనికి సంబంధించి టెండరును స్టాండింగ్ కౌన్సిల్‌లో పెట్టారు. అయితే ఏ కారణం చేతనో దానిని అప్పట్లో పక్కన పెట్టారు. అయినప్పటికీ మున్సిపల్ ఇంజనీరింగ్ అధికార యంత్రాంగం కాంట్రాక్టరుకు టెక్నికల్ శాంక్షన్ వర్క్ ఆర్డర్లు ఇచ్చి అగ్రిమెంట్లు చేసు కున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ తరువాత పని మొదలు పెట్టే సమయంలో మరో దఫా రికార్డులు పరిశీలిస్తే పని మంజూరు కానట్లు గుర్తించారు. ఆ తరువాత జరిగిన స్టాండింగ్ కమిటీలో పెట్టి పని మంజూరు చేసినట్లు సమాచారం.



మహిళా ప్రాంగణం వద్ద వేస్తున్న సిమెంటు రోడ్డు

నాసిరకంగా పనులు

రూ.50లక్షల వ్యయంతో చేపడుతున్న రోడ్డు పనుల్లో నాణ్యత లోపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం గ్రావెల్ సబ్ బెస్‌జీఎస్‌బీలో 20 ఎంఎం, 16 ఎంఎం, 48 ఎంఎం, 12 ఎంఎం మెటీరియల్ వేయాల్సి ఉండగా ఇందులో సరిపడా మెటీరియల్ వాడనట్లు సమాచారం. జీఎస్బీ తరువాత నాలుగించి మేర వెట్ మిక్స్ చేసి వైబర్ మిక్స్‌తో రోలింగ్ చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయిన తరువాత దాదాపు రోడ్డు వేసినట్లుగా దారి గట్టి పడాల్సి ఉంది. ఆ తరువాతనే ఏడు ఇంచుల మందంతో రోడ్డు వేయాలనేది నిబంధన. కానీ ప్రస్తుతం అక్కడ ఇవేవీ చేయకుండానే కేవలం కంకర పరిచి దానిపై రోడ్డు వేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో కూడా ఇదే కాంట్రాక్టరు చేపట్టిన పనుల్లో నాణ్యత లేకపోవడంతో కొంత కాలం పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. కొన్ని చర్యలు తీసుకున్న తరువాత తిరిగి పనులు అప్పగించినట్లు సమాచారం.

ఆ పనుల్లో నాణ్యత లేదు

ఎస్‌బీఐ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్లో నిబంధనల మేరకు నాణ్యత లేదని నగరపాలక సంస్థ క్వాలిటీ కంట్రోల్ విభాగ అధికారి అబ్బాస్ పేర్కొన్నారు. ఈ మేరకు పనులు పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని, నిబంధనల ప్రకారం రోడ్డు పనులు పూర్తి చేస్తేనే కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించడం జరుగుతుం దన్నారు. నగరపాలక సంస్థ ఏఈ నాగార్జునను వివరణ కోరగా, పనులన్నీ నిబంధనల మేర జరుగుతున్నాయన్నారు. పనులు పూర్తయ్యేంత వరకు అవి నాసిరకంగా జరిగాయని నిర్ధారించడం కుదరదన్నారు.

మోదీ పెద్ద అబద్ధాల పుట్ట

- అమరావతికి మళ్లీమళ్లీ శంకుస్థాపనలు విడ్డూరం
- అప్పులు కాదు...అమరావతికి గ్రాంట్ ఇవ్వాలి
- మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి ధ్వజం

కడప కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా అమరావతికి అన్ని రకాలుగా సంపూర్ణ మద్దతిచ్చామని ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి బహిరంగ సభలో చెప్పడం విడ్డూరంగా, అబద్ధాల పుట్టగా ఉందని మాజీ రాజ్యసభ సభ్యుడు, పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని పలుకులు పచ్చి అబద్ధాలు అన్నారు. పిల్లికి భిక్షం వేసినట్టుగా ఈ పదేళ్ల మోదీ అమరావతికి ఇచ్చింది కేవలం రూ.2500 కోట్లు మాత్రమే అన్నారు. 2015 అక్టోబరు 22న విజయ దశమి నాడు పార్లమెంట్ మట్టి, యమునా నది నీటిని తెచ్చి అట్టహాసంగా ప్రజా సమక్షంలో ప్రధాని రాజధాని అమరావతికి శంకుస్థాపన చేశారన్నారు. డిల్లీని మించిన రాజధాని ఏర్పాటు చేస్తామన్నారు. పదేళ్ల తరువాత ఉద్దండరాయుని పాలెం వద్ద వేసిన శిలాఫలకం రాయి కూడా లేదన్నారు. ఇవాళ చెల్లి పెళ్లి మళ్లీమళ్లీ అన్నట్లు శంకుస్థాపన అవసరమా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హోదా గురించి, రాయల సీమ అభివృద్ధికి ప్యాకేజీ, సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్యాక్టరీ లాంటి విభజన చట్టంలోని అంశాలను ప్రస్తావనే లేదని విమర్శించారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాజధాని, శాసనమండలి, అసెంబ్లీ, హైకోర్టు, రాజ్‌భవన్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇన్నాళ్లుగా అమరావతి పేరుతో బ్యాంకుల్లో అప్పులు తెచ్చారని, కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ ఇవ్వదా అని ప్రశ్నించారు. పీఎం-సీఎంలు ఒకరిని ఒకరు పొగడ్తతో ముంచెత్తుకొనేందుకు అమరావతి సభ సాగినట్లు ఉందని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ దేశభక్తిని గూర్చి చేసిన వ్యాఖ్యలు అర్థం పర్థం లేనివని కొట్టి పారేశారు. ఈ దేశం కోసం కాంగ్రెస్‌లో మహాత్మాగాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు ఆత్మ బలి దానం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ గౌడ్, ఎస్ఏ సత్తార్, సిరాజుద్దీన్, సంఘ సేవకులు సలావుద్దీన్, కుళ్లాయప్ప, రఫీఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ సభ్యుడు తులసి రెడ్డి

ఎరువుల వినియోగంపై అవగాహన తప్పనిసరి

కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి ● అన్నదాతకు అధికారుల సూచనలు

పులివెందుల టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్, రబీ సీజన్‌లో ఎరువులు, పురుగుమందుల వాడకం అధికంగా ఉంటుంది. ఇలాంటి సమయంలో మార్కెట్ లోకి నకిలీ ఎరువులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ సీజన్‌లో ఎరువులు, పురుగు మందులు కొనుగోళ్లు చేసే విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అజాగ్రత్తగా ఉంటే నిలువునా మోసపోయే అవకాశం ఉందన్నారు. నిషేధిత పురుగుమందులు కొనుగోలు చేస్తే నిలువునా మునిగిపోయినట్లే అంటున్నారు. పంట దిగుబడి అధికంగా వస్తుందని నమ్మించి కొంత మంది అనుమతి లేని కంపెనీల ఎరువులు, మందులు రైతులకు అంటకట్టే అవకాశం ఉంది. దుకాణాల్లో తక్కువ ధరలకే పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తున్నారని వాటిని కొనుగోలు చేయరాదు, అవి కంపెనీ మందులా, లేక స్థానికంగా తయారు చేసి విక్రయిస్తున్నారా అనే విషయాలను రైతులు తెలుసుకోవాలి. ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలి. లైసెన్సు లేని దుకాణాలు, దళారుల వద్ద కొనుగోలు చేయరాదు.



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న డివిజను వ్యవసాయ సహాయ సంచాలకుడు ప్రభాకర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

అనుమతులు ఉండాలి
డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ప్రభాకర్‌రెడ్డి

ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. అవసరమైనవి కొనుగోలు చేసినవి అయితే తప్పక ఆ షాపు యజమాని సంతకం చేసిన బిల్లులు రైతులు తీసుకోవాలి. క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో డబ్బాపై ఉన్న వివరాలు పరిశీలించాలి. అర్థం కాకపోతే తెలిసిన వారికి చూపించాలి. మందులు పిచికారీ గురించి ముద్రించిన కరపత్రాలు తీసుకోవాలి. మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన డబ్బాలను సంచులను పంట దిగుబడి చేతికి వచ్చేంత వరకు భద్రపరచాలి. ఒకవేళ నష్టం వస్తే సంబంధిత డీలరుపై కేసులు నమోదు చేయడానికి ఉపయోగపడతాయి.

నేటి లాంగ్ మార్చ్ ర్యాలీని జయప్రదం చేయండి

కడప సెవెన్ రోడ్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ వక్ఫ్ పరిరక్షణ జేఏసీ కడప ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9గంటలకు కడప నగరంలోని గౌస్‌నగర్ నుంచి లాంగ్ మార్చ్ భారీ ర్యాలీ ప్రారంభం అవుతుందని అందులో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని వక్ఫ్‌పరిరక్షణ జేఏసీ కడప జిల్లా కన్వీనర్ అహ్మద్ బాబు బాయ్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ భవనంలో వక్ఫ్ పరిరక్షణ జేఏసీ సమావేశం జరిగింది. ఆలిండియా పర్సనల్ లా బోర్డు రాష్ట్ర నాయకులు ఇషాక్ అలీ, సీపీఎం జిల్లా కార్యదర్శిచంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఆర్‌సీపీ రవిశంకర్‌రెడ్డి, ఎస్‌డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు తన్వీర్, నగర కన్వీనర్ మౌలానా జాకీర్ హుస్సేన్, సీపీఐఎం ఎల్.ఓబయ్య, కాంగ్రెస్ గౌస్‌పీర్, వైసీపీ షఫీ హాజరయ్యారు.

5న దక్షిణ మండలి సలహా సమావేశం

సీకేదిన్నె, మే 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5, 6 తేదీల్లో దక్షిణ మండల పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం, రబీ పంటలకు ఊటుకూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించడం జరుగుతుందని, ఏరువాక కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్తలు అంకయ్యకుమార్, వీరయ్య, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానశాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలోని వ్యవసాయ శాఖ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ పరిశోధన, విస్తరణ కేంద్రాల శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొంటారన్నారు.

ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

వేంపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, ఉర్దూ హైస్కూళ్లలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ స్టాలిన్ ఐజాక్ తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో తరగతులు నిర్వహించి పాఠ్యాంశాలు బోధించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇటీవల వచ్చిన 10వ తరగతి ఫలితాల్లో జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలల్లో 150 మంది దాకా ఫెయిల్ అయ్యారు. విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఆ ప్రకటనలో తెలిపారు.

మొబైల్ ఆధార్ కేంద్రం ఏర్పాటు

సీకేదిన్నె, మే 3 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలోని సచివాలయంలో మొబైల్ ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎంపీడీవో కుళాయి బాబు తెలిపారు. ఈనెల 5 నుంచి 8 వరకు, 12 నుంచి 15వ తేదీ వరకు ఆధార్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్‌కార్డు చేయడంతోపాటు ఆధార్‌కార్డులో చిరునామా,ఫొటో మార్పుట, ఫోన్‌నంబరు లింక్ చేసుకోవడం, వేలిముద్రలు అప్‌డేట్ చేయడం జరుగుతుందని తెలిపారు.

కల్వర్టుకు మరమ్మతులు

కడప మారుతీనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కొన్ని సంవత్సరాలుగా నగర 9వ డివిజను ఎన్జీవో కాలనీలో రెండురోడ్లకు సంబంధించిన కల్వర్టు దగ్గర గుంతలు పడి ప్రమాదకరంగా టూవీలర్ వాహనదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శనివారం ఆ డివిజను బీజేపీ ఇన్‌చార్జి బత్తల పవన్‌కుమార్ తన సొంత నిధులతో అక్కడి కల్వర్టు పనులకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పర్యాయాలుగా సంబంధిత డివిజనులో కార్పొరేటరుగా గెలిచిన వైసీపీ కార్పొరేటరు పాదచారుల ఇక్కట్లను ఆ ప్రాంత ప్రజల ఇబ్బందులు ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులుమునగాసతీష్,గౌరీశంకర్,బాలయ్య,శ్రీను,గంగాధర, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు న్యాయసహాయం

కడప రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి) : జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా అసంఘటిత కార్మికులను గుర్తించి వారికి తగు న్యాయసహాయం అందించడం జరుగుతోందని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మేడే వారోత్సవాల సందర్భంగా శనివారం నగరంలోని అప్సర థియేటర్ సర్కిల్‌లోని అసంఘిత కార్మికులకు అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎల్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో మే 1 నుంచి 7 వరకు మేడే వారోత్సవాలను నిర్వహించి వివిధ రంగాలలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్ రోడ్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో విదేశీ కంపెనీలను అనుమతించవద్దని, ఎల్‌ఐసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని మే 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య పిలుపునిచ్చారు. జిల్లా విస్తృత సమావేశంలో తిరుపతయ్య మాట్లాడుతూ తమ డిమాండ్లపై మే 20నాటి సమ్మెను బ్యాంకు సిబ్బంది, ఇతర కార్మికవర్గంతో కలిపి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి, నాయకులు అక్బర్‌బాష, వై.కళ్యాణ్, పారిజాతమ్మ, రాజు, అయ్యవారురెడ్డి, రత్నకిశోర్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జి.తిరుపతయ్య

ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులలో పదో తరగతి తప్పిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారే కానీ ఆ ఉత్తర్వులలో సంపాదిత సెలవు లేకుండా (ఎర్న్‌డ్ లీవ్) ఇవ్వడం అంటే నిర్బంధ నియంతృత్వ ఉత్తర్వులే అని పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏసీవీ గురువారెడ్డి, వైఎస్సార్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి సుబ్బారెడ్డి, ఎన్వీ సుబ్బారెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ సంబంధించిన ప్రతి అధికారి ఏసీ రూముల్లో, ఏసీ కార్లల్లో తిరుగుతూ అన్ని రకాల అలవెన్సులు, సంపాదిత సెలవులు పొందుతూ ఉపాధ్యాయులు మాత్రం వెట్టిచాకిరీ వ్యవస్థలో పనిచేస్తున్నట్లు రాత్రికి రాత్రి ఉత్తర్వులు జారీ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

లింగాల, మే 3 (ఆంధ్రజ్యోతి): దిగువలింగాల కోదండ రామాలయంలో శనివారం సీతారాముల కల్యాణాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. రామాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానకార్యక్రమం నిర్వహించారు.

డీఎస్సీ అభ్యర్థులకు సైకాలజీ మెటీరియల్ ఉపయోగకరం

కడప ఎడ్యుకేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థులకు సైకాలజీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ శనివారం కడపనగరం యూటీఎఫ్ భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో రూపొందించిన సైకాలజీ స్టడీమెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచితంగా మెటీరియల్ కావాల్సిన వారు యూటీఎఫ్ జిల్లా శాఖను సంప్రదించి పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, కేదార్‌నాథ్, నాగిరెడ్డి, ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు విద్యా హక్కు చట్టం ద్వారా 25శాతం పేద విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత విద్య అవకాశాలను కల్పిస్తున్నట్లు ఎంఈవో ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని కాగితాలపెంట పరిసరాల ప్రాంతాలలో విద్యాహక్కు చట్టం ద్వారా (12 1 సి) ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఇచ్చిన విద్యకు సంబంధించిన బ్యానర్‌ను రిలీజ్ చేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఒకటో తరగతి చదువు తున్న విద్యార్థులు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ నియమ నిబంధనల ద్వారా అర్హులను ఎంపిక చేసి విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఎంపిక చేయబడేందుకు తప్పనిసరిగా విద్యార్థులు తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వారి సచివాలయానికి ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న పాఠశాలను మాత్రమే ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడప మండల సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

ట్రైనీ వైద్యులకు వ్యాక్సినేషన్‌పై అవగాహన

చెన్నూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న వైద్యవిద్యార్థులకు వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. చెన్నూరు పీహెచ్‌సీలో శనివారం డాక్టర్ సాయిచందన, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి ప్రజలకు వాక్సినేషన్ ఇవ్వాల్సిన సమయంలో ముందుజాగ్రత్తగా వాటిని ఎలా నిల్వ చేయాలి, ఎంత టెంపరేచర్‌లో వాటిని ఉంచాలి, వాటి నిర్వహణ, వాక్సినేషన్ తయారు చేసే విధానం, వాటి కాలపరిమితి లాంటివి వైద్యవిద్యార్థులు తెలిపారు. ప్రతి బుధ, శనివారాల్లో ఈ వ్యాక్సినేషన్ ఇస్తారు కాబట్టి ఆ సమయం వరకు వాటిని ఎలా నిల్వ ఉంచాలన్నదానిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది జయప్రకాశ్, రెబక, సుబ్బరాయుడు, షణ్ముగం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



సీకేదిన్నె, మే 3 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలో ఈదురుగాలుకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలపల్లె, ఇప్పెంట గ్రామాల్లో గురువారం వీచిన పెద్ద గాలులకు అరటి, మామిడి, తదితర తోటలు నేల కొరిగాయి. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. పంట నష్టానికి సంబంధించి నివేదిక ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఈశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పులివెందుల ఎంపీడీఓగా శ్రీనివాసరెడ్డి

పులివెందుల రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పి.శ్రీనివాసరెడ్డి నియామకం అయ్యారు. సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డికి పదోన్నతి కల్పించి పులివెందుల ఎంపీడీఓగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన పులివెందులలో బాధ్యతలు చేపట్టారు. కాగా ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రామాంజనేయరెడ్డి ఏఓగా కొనసాగనున్నారు.

పారిశుధ్యం, తాగునీటికి ప్రత్యేక చర్యలు



వేంపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పారిశుధ్యం, తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. రెండు రోజులుగా డీఎల్‌పీఓ రమాదేవి వేంపల్లెలో ఉంటూ సిబ్బందితో సమావేశం నిర్వహించి పారిశుధ్య పనులను పర్యవేక్షించగా శనివారం జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి వేంపల్లెలో పర్యటించారు. ఖాజీపేట, చెన్నూరు, నంది మండలం నుంచి తెప్పించిన 20 మంది పారిశుధ్య సిబ్బందితో పాటు స్థానిక సిబ్బందితో వేంపల్లె పారిశుధ్యం పనులు చేపట్టారు. అనంతరం కార్యాలయంలో డీఎల్‌పీఓ రమాదేవి, ఈఓ రామ సుబ్బారెడ్డిలతో ఎంపీడీఓ కుళాయమ్మతో సమావేశం అయ్యారు.

ఎమ్మెల్యే కృషితో పెన్నాకు నీరు విడుదల

కమలాపురం రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి కృషితో కమలాపురం సమీపంలోని పెన్నానదికి అధికారులు నీటిని విడుదలచేశారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండడంతో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో నదీ పరివాహక మండలాలైన కమలాపురం, వల్లూరు మండలాల ప్రజలు తాగునీటికి, రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడ్డారు. అది గమనించిన ఎమ్మెల్యే కోరిక మేరకు సమస్యను కలెక్టరు దృష్టికి తేవడంతో స్పందించిన ఆయన మైల వరం ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించారు.

ఘనంగా పెద్దమ్మ దేవర మహోత్సవం



దున్నపోతులను ఊరేగిస్తున్న గ్రామస్థులు

సింహాద్రిపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): దాదాపు 80 ఏళ్ల తర్వాత సింహాద్రిపురంలో జరిగే పెద్దమ్మ దేవర శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయాన్నే సింహాద్రిపురంలో దున్నపోతును బాజా భజంత్రీల మధ్య ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు దున్నపోతును పసుపు, కుంకుమలతో పూజించారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సాయంత్రం పెద్దమ్మ దేవత ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్రమం బుడ్డయ్యపాళెం బస్టాండు సర్కిల్ నుంచి మొదలై, పురవీధుల వెంట ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవర కార్యక్రమాలు ప్రారంభించారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత బలి కార్యక్రమం, అనంతరం పొలి కార్యక్రమం నిర్వహించారు. పొలి పూర్తయిన తర్వాత కొత్తూరు చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల కార్యక్రమం ప్రారంభించారు.

గాలివాన బీభత్సం

● పడిపోయిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ● తడిసిన పంట దిగుబడులు


ఎంకుపల్లె పొలంలో పడిపోయిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

దువ్వూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న ప్రకృతి ఒక్కసారిగా విజృంభించింది. శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పొలాల్లో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు కింద పడ్డాయి. పసుపు, నువ్వులు, మొక్కజొన్న, వేరుశనగ పంటలు ఆరబెట్టగా అవి తడిసిపోయాయి. సుమారు గంటపాటు గాలివాన ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. పలుచోట్ల రేకుల షెడ్డులు విరిగిపడ్డాయి. మండల వ్యాప్తంగా ఆరు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయని, 35 కరెంటు స్తంభాలు కిందపడ్డాయని, అర్ధ కిలోమీటరు మేరకు విద్యుత్తు వైర్లు తెగిపడ్డాయని ఏఈ నరేంద్రారెడ్డి తెలిపారు. సుమారు రూ.10 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు వ్యక్తమవుతోంది. వ్యవసాయ శాఖకు సంబంధించి మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తిని సంప్రదించగా పంట నష్టం జరిగినట్లు మండలాల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేవన్నారు.


జమ్మలమడుగులో విరిగిన విద్యుత్తు స్తంభం.. తెగిన తీగెలు

నేలకొరిగిన మామిడి చెట్లు

పోరుమామిళ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సానికి రంగసముద్రం పంచాయతీ పరిధిలోని గాయకవాడ సుబ్బారావుకు చెందిన మామిడి తోటలో దాదాపు నాలుగు టన్నుల మామిడికాయలు నేలరాలాయి. 13 చెట్లకు పైగా నేలకొరిగాయి. కాపు చేతికి వచ్చి ఉండింటే టన్ను రూ.70వేలు ధర పలికేదని, ఈ అకాల వర్షం కారణంగా కనీసం రూ.10వేలు కూడా పలికే పరిస్థితి లేదని రైతు వాపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులరెడ్డిని వివరణ కోరగా తమ సిబ్బందిని పంపి నష్టం అంచనా వేస్తామన్నారు.



రూ.15లక్షలు మేర నష్టం

చెన్నూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గురు, శుక్రవారాల్లో వీచిన ఈదురు గాలులకు కొండపేట, రామనపల్లె, గోపవరం, ఓబులం పల్లె, ఆలంఖాన్‌పల్లె గ్రామాల్లోని బయటి ప్రాంతాల్లో దాదాపు 20 విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. పూర్తిగా పలుచోట్ల విద్యుత్‌స్తంభాలు నెర్ర ఉబారాయి. దీంతో విద్యుత్‌తీగలు సైతం తెగి నేలపై పడ్డాయి. సుమారుగా రూ.15లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ట్రాన్స్‌కో ఈఈ రామలింగారెడ్డి తెలిపారు. అలాగే 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 8, ఆరు సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఐదు 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు సైతం దెబ్బతిన్నాయని, వీటిలో సాగునీటి అవసరాలకు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రేయింబవళ్లు పనిచేసి తెల్లారేసరికి సిబ్బంది బాగు చేయడం, కొత్తవి తెచ్చి పెట్టడం జరిగిందని తెలిపారు.

విరిగిపడిన స్తంభాలు

జమ్మలమడుగు, మే 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో శుక్రవారం రాత్రి ఈదురు గాలులు వీచాయి. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో, గ్రామాల్లో చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. పెద్ద పసువుల మోటులోని తేరురోడ్డు ఎదురుగా కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. అలాగే విద్యుత్తు తీగెలు రోడ్డుపొడవునా పడ్డాయి. అనేక చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం కలిగింది. ప్రజలు అంధకారంలో దోమలతో కొంత ఇబ్బందులు పడ్డారు.

క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగి ఉండాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఈవో షంషుద్దీన్

బద్వేలు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కాలేజీ ఆవరణలోని ఇండోర్ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో ఇటీవల పది పరీక్ష ఫలితాల్లో బద్వేలు, గోపవరం మండలాల్లోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అనంతరం అధిక మార్కులు సాధించిన సుమారు 30 మంది విద్యార్థులకు నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్షుడు ఎస్.చెన్నయ్య, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఎంఈవో సునీల్‌కుమార్, ఆపస్ నాయకులు అంకయ్య, వెంకట్రామిరెడ్డి, రామక్రిష్ణంరాజు, శ్రీధరరెడ్డి, తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

పూడ్చిపెట్టిన మృతదేహానికి శవ పరీక్ష


మృతదేహానికి శవపరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

చెన్నూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కొత్తగాంధీనగర్‌కు చెందిన సుందరరావు (63) గత ఏడాది డిసెంబరు 15న మృతి చెందడం జరిగింది. ఆ మృతదేహాన్ని పూడ్చిపెట్టగా బంధువులు కోరిక మేరకు శనివారం దానికి శవ పరీక్ష చేయడం జరిగింది. రిమ్స్ అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్ సీఐ కృష్ణారెడ్డి, తహసీల్దారు సరస్వతి, ఆర్ఐ కౌశిక్‌ల ఆధ్వర్యంలో ఈ శవ పరీక్ష నిర్వహించారు. కాగా గత ఏడాది అక్టోబరు 21న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో సుందరరావుకు బలమైన గాయాలయ్యాయని, రిమ్స్‌కు అనంతరం తిరుపతి స్విమ్స్‌కు తీసుకువెళ్లగా డిసెంబరులో సర్జరీ చేశారు. చికిత్స పొందుతూ అక్కడే చనిపోవడం జరిగింది. కాగా ప్రమాదం విషయం పోలీసుస్టేషనులో చెప్పకపోవడంతో ఎలాంటి కేసులు నమోదు కాలేదు. చివరికి బంధువులు జిల్లా పోలీసు అధికారులను ఆశ్రయించడంతో వారి సూచనల మేరకు శనివారం మృతదేహాన్ని బయటికి తీసి శవ పరీక్ష చేశారు.

ఇద్దరు మట్కా బీటర్ల అరెస్టు

కడప క్రైం, మే 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు మట్కాబీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమర్‌నాధరెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. పాతబస్టాండు సమీపంలో మట్కా ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో సీఐ రామకిష్ణ ఆదేశాల మేరకు దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వీరి వద్ద నుండి 12,200 నగదు, మొబైల్ ఫోను, మట్కాస్లిప్పులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి యువకుడి మృతి



రాజంపేట టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఓ ఇసుక ట్రాక్టర్‌పై కూర్చొని ప్రయాణిస్తున్న బి.వెంకటేశ్(28) ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. శనివారం సాయంత్రం హేమాద్రిపల్లెకు చెందిన వెంకటేష్ ఇసుక క్వారీ నుంచి పట్టణానికి తీసుకొని వస్తూ డ్రైవర్ సీట్ వద్ద కూర్చున్న వెంకటేష్ ప్రమాదవశాత్తు టైర్ కిందపడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పీలేరులో ఈదురుగాలుల బీభత్సం

● నేల రాలిన మామిడి

● ధ్వంసమైన పాలి హౌజ్


రైతు వెంకటరమణారెడ్డి తోటలో ధ్వంసమైన పాలి హౌజ్

పీలేరు, మే 3(ఆంధ్రజ్యోతి): పీలేరులో శనివారం మధ్యాహ్నం వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలుల తీవ్రతకు మండలంలోని పలుచోట్ల మామిడి పంట నేలరాలిపోగా కొన్నిచోట్ల షెడ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. పీలేరు మండలం ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ఆదర్శ రైతు దేవిరెడ్డి వెంకటరమణారెడ్డి తోటలోని పలు చెట్లలో మామిడి పండ్లు నేలరాలాయి. అతని పొలంలోని పాలి హౌజ్ పాక్షికం గా ధ్వంసమైంది. దీంతో తనకు సుమారు రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లిందని వెంటకరమణా రెడ్డి వాపోయారు. అదే విధంగా రామిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు గరుడారెడ్డి తోటలోనూ మామిడి నేల రాలిపోయింది. తన తోటలోని అధిక శాతం చెట్లలోని మామిడి పండ్లు నేలరాలిపోయాయరని, తద్వారా తనకు రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లిందని గరుడారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అసలే అంతంత మాత్రంగా ఉన్న పంట, ఈదురు గాలికి నేలరాలిపోవడంతో తాను పూర్తిగా నష్టపోయాయని ఆయన తెలిపారు.

రాజా ఫౌండేషన్ భూములు స్వాధీనం

● నిబంధనల ఉల్లంఘనతో 50.37 ఎకరాలు ప్రభుత్వపరం


రాజా ఫౌండేషన్‌కు ఇచ్చిన స్థలాలను స్వాధీనం చేసుకోని బోర్డు ఏర్పాటు చేసిన తహసీల్దారు, సిబ్బంది

ప్రొద్దుటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మైలవరం మండల హెడ్‌క్వార్టర్స్‌లో రాజా ఫౌండేషన్‌కు 2005, 2009 సంవత్సరాలలో అప్పటి మార్కెట్ వాల్యూతో ఇచ్చిన 50.47 ఎకరాల భూములను నిబంధనల ఉల్లంఘన కారణంగా తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. శనివారం తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున, మండల సర్వేయర్ సాయిలత, వీఆర్వో షాబుద్దీన్ తమ సిబ్బందితో కలిసి రాజా ఫౌండేషన్‌కు ఇచ్చిన భూములలో బోర్డులు పాతారు. మైలవరం గ్రామ పొలం సర్వేనెంబరు 74/1లో 12 ఎకరాలు అనాథ పిల్లలకు పునరావాస కేంద్రనిర్మాణంతో పాటు వృత్తి శిక్షణ కేంద్ర నిర్మాణం, గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం కేటాయించారు. అలాగే సర్వే నెంబరు 74/2లో 3.03 ఎకరాలు, సర్వేనెంబరు 82 లో 7.90 ఎకరాలు, 83/1లో 6.54 ఎకరాలు, 84/1లో 11.12 ఎకరాలు, 85/1లో 7.41 ఎకరాలు, 86లో 4.00 ఎకరాలు మొత్తం 40 ఎకరాలలో ఎయిడ్స్ రోగుల పునరావాస కేంద్రం, అనాథ పిల్లలు, వీధి బాలలు, వికలాంగులకు ఫిజియోథేరపి సెంటర్‌తో పాటు విద్యా కేంద్రాలు నిర్మించాలని కేటాయించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో తహసీల్దారు, ఆర్డీవోలు ఈ భూములు ప్రభుత్వ నిబంధనల మేరకు వినియోగింపబడుతున్నాయా లేదా అని విచారించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఈ భూముల్లో కేవలం సర్వేనెంబరు 74/1లోని 12 ఎకరాలలో డాడీ హోం బిల్డింగ్ 1.00 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఎయిడ్స్ రోగుల పునరావాస కేంద్రం 10సెంట్లలో, బీఈడీ కాలేజీ 0.40 సెంట్లలో, పశువుల కొట్టం 0.10 సెంట్లలో, మూడు సెంట్లలో సమాధి నిర్మించి వున్నారని మొత్తం 12 ఎకరాలలో 1.63 ఎకరాలు తప్ప తక్కిన 10.37 ఎకరాలు ఖాళీగా వుంది. అలాగే పైసర్వేనెంబర్లలోని 40 ఎకరాల్లో కూడా ఏ ఒక్క నిర్మాణం చేపట్టక నిరుపయోగంగా వున్నదని తమ నివేదికలో పేర్కొన్నారు. నిరుపయోగంగా ఉన్న మొత్తం 50.37 ఎకరాల భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని బోర్డులు ఏర్పాటు చేశారు.

రాళ్లదాడి కేసులో ముగ్గురు అరెస్టు

కడప క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సెవెన్‌రోడ్స్ వద్ద ఆకులవీధికి చెందిన వ్యక్తి ట్యాబ్లెట్లు కొనేందుకు రావడంతో ముగ్గురు వ్యక్తులు స్కూటీలో వచ్చి ఆయనపై దాడి చేసిన కేసుకు సంబంధించి ఇద్దరు యువకులు, ఒక యువతిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. గత నెల 26న రాత్రి కడపకు చెందిన యువతి క్రిష్ణసర్కిల్ వద్ద తప్పిపోయిన బంధువును వెదుకుతున్న క్రమంలో మద్యం మత్తులో అక్కడికి వచ్చిన మహ్మద్ పీర్ అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆమె మణికంఠ, నరసింహకు తెలిపిందన్నారు. మరుసటి రోజు ఏడురోడ్ల కూడలి వద్దకు మహ్మద్‌పీరా రావడంతో యువతితో పాటు ఇరువురు బైకుపై వచ్చి రాళ్లతో దాడి చేసి అక్కడి నుంచిపారి పోయారన్నారు. నరసింహ, మణికంఠలను క్రిష్ణసర్కిల్ వద్ద శనివారం అరెష్ట చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు.

పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కడప మారుతీనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యలో మరింత ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఉత్తమ ఫలితాలు సాధించిన పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు పద్మశాలీయ సేవా సంఘం అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు తెలిపారు. శనివారం స్థానిక చిన్నచౌక్ వద్ద గల పద్మశాలీ భవన్(కళ్యాణమండపం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా 10వ తరగతిలో 550 మార్కులకు పైగా, అలాగే ఇంటర్, ఎంపీసీ, బైపీసీ విభాగాలలో 900 మార్కులకు పైగా, ఆర్ట్స్ గ్రూపులలో 800 మార్కులకు పైగా, ఎంసెట్ ఇంజనీరింగ్, నీట్ మెడిసిన్ విభాగాలలో జిల్లా స్థాయిలోనే కాకుండా పట్టణ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినవారు అర్హులన్నారు. మార్కుల జాబితాతో పాటు టీసీ జిరాక్స్‌కాపీ, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు, ఫోన్ నెంబర్, బయోడేటాతో సహా పూర్తిచేసిన దరఖాస్తులను జూన్ 5లోగా పద్మశాలీభవన్‌కు పంపించాలన్నారు. ఇతర వివరాలకు 9849026877, 9885122084 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో పద్మశాలీయ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అవ్వారు వెంకటసుబ్బయ్య, విద్యాకమిటీ కన్వీనర్ వెంకటసుబ్బయ్య, యానాదయ్య, వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ బదిలీ

● కొత్త ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జమున

కలికిరి, మే 3(ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ సురేఖను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ సురేఖను నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఆమె స్థానంలో కడప ప్రిన్సిపాల్‌గా ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ టి.జమునను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఆదేశాలు జారీ చేశారు.

6న డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజరు

కడప మారుతీనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఏదేని ఆర్టీసీ బస్సుల రాకపోకల విషయంగా సమస్యలను నివృత్తి చేసుకునేందుకవీలుగా ఈనెల 6న మంగళవారం డయల్ యువర్ కడప డిపో మేనేజరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంబంధిత డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఆర్టీసీ సమస్యలపై ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను సలహాలను సూచనలను తెలపాలన్నారు. 9959225774 అనే నెంబరుకు ఫోను చేసి లేదా వాట్సప్ చేసి తెలియపరచాలన్నారు.

అశ్వవాహనంపై శివకేశవులు

వల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశ్వవాహనంపై శివకేశవులు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శనివారం ఉదయం పరమేశ్వరునికి, కామాక్షి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లఘు పూర్ణాహుతి, సాయంత్రం వైద్యనాథేశ్వరుని సుందరంగా అలంకరించి అశ్వవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

నేటి నుండి అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం నుండి 15వ తేదీ వరకు పది రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తామని, 5న స్వామివారి కల్యాణం, 12న రథోత్సవం, 13న భక్తులకు అన్నప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. 6వ తేదీ నుండి ప్రతిరోజు సాయంత్రం స్వామివారిని వివిధ వాహన సేవల్లో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు సాయంత్రం 7 గంటలకు నటరాజ కళాక్షేత్రం చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు మల్లికార్జునశెట్టి, మహేశ్వరశర్మ, వెంకటరామయ్య పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిలను కలిసిన కలెక్టర్, ఎస్పీ

కడప రూరల్; మే 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో శని, ఆదివారాల్లో జరుగుతున్న జ్యుడిషియల్ వర్క్‌షాపు, జ్యుడిషియల్ కాన్ఫరెన్స్ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జిలు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, బీవీఎల్ఎన్ చక్రవర్తిలను శనివారం కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

అలాగే ఉమ్మడి కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హైకోర్టు జడ్జిలను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు.






లక్ష్మీచెన్నకేశవస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పుట్టా


బీటీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బ్రహ్మంగారిమఠం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగురాళ్లపల్లె పంచాయతీ కొత్తపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి తిరునాళ్లకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ శనివారం హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఇటీవల రూ.94 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. దేవస్థానం ఆలయ ప్రాంగ ణంలో వృషభరాజముల బండలాగుడు పోటీలు ప్రా రంభించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడు తూ మైదుకూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది ప్రతి మండలాన్ని అభివృద్ధి బాటలో తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, యువ నాయకుడు కాణాల మల్లికార్జునరెడ్డి, మేకల పసుధాకర్ , యల్లటూరు సాంబశివారెడ్డి, చిలమల నాగయ్య, సర్పంచ్ నారాయణ, సన్నపూరి శ్రీను, తేకలకుంట్ల శివ, గుజ్జు రామాంజనేయులు, ముడుమాల పోలిరెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



4 ఆంధ్రజ్యోతి నవ్య కుటుంబ కదంబం 4 మే 2025 ఆదివారం







37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం.

నేను రుణపడేది ఆయనకే!

తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... కె. రాఘవేంద్రరావు. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...



మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

• హీరో కావాలని అనుకోలేదు

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

• లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్‌వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

• మూడు తరాల హీరోలతో...

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

• ఆ టెన్షన్ ఉండేది

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకోవచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

• సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి


సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

• పాటలో మొత్తం రామాయణం

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు'. 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.

• వినాయకరావు

ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్స్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్స్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జిని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

28 రోజుల్లో 'జ్యోతి'




ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు..' అని వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.

మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీలో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'



నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలిన ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్	THE DIPLOMAT	
ది డిప్లొమాట్	హిందీ చిత్రం	మే 09
గుడ్ బ్యాడ్ అగ్లీ	తమిళ చిత్రం	మే 08
ది రాయల్స్	హిందీ సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్	Royals	
గ్రామ్ చికిత్సాలయ్	హిందీ చిత్రం	మే 09
జియో హాట్‌స్టార్		
స్టార్‌వార్స్	యానిమేషన్ సిరీస్	మే 04

వినోదాత్మక చికిత్స

ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.




బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

- ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.
- బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.



- బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.
- బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

- ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

- సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.
- విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.
- నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
- విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.
- కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.
- విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



అద్భుతమైన మహిళల కోసం

నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.



"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలోమీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.

సంపాదించింది అంతా...

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.

దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

మహిళా దినోత్సవంనాడు...

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోర్ట్రైట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్ట్‌ను చేపట్టాను."

- బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

వైద్యులు రాక.. రోగుల పాట్లు


డాక్టర్లు లేక తలుపులు వేసి ఉన్న దృశ్యం


ప్రభుత్వ ఆస్పత్రిలో క్యూ కట్టిన రోగులు

జమ్మలమడుగు, మే 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్య చికిత్సల కోసం ప్రభుత్వాస్పత్రికి వస్తే అక్కడ డాక్టర్లు విధులకు డుమ్మా కొట్టడంతో చేసేది లేక రోగులు వెనుదిరిగి పోవాల్సి వచ్చింది. జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి శనివారం ఉదయం 9.30 గంటలకు జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం సమీప గ్రామాల రోగులు వచ్చారు. అయితే ఆ సమయంలో ఆస్పత్రిలో డాక్టర్లు ఎవ్వరూ విధులకు హాజరుకాలేదని కొందరు రోగులు అసహనం వ్యక్తం చేశారు. అసలు ఓపీ విభాగం డాక్టర్లు లేకపోవడంతో వారి గది తలుపులు మూసే ఉండడంతో రోగులు వారి సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక కొంద రు వెనుదిరిగి వెళ్లక మరి కొందరు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకోవాల్సి వచ్చింది. జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మంచి వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వైద్యాధికారులకు సూచిస్తున్నా ఎందుకు వారు స్పందించ డంలే దంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇద్దరి నుంచి ముగ్గురు డాక్టర్లు మాత్రమే రోగులను పరీక్షించినట్లు రోగులు తెలిపారు. డాక్టర్లు సొంత క్లీనిక్‌లకే ప్రాధాన్యత ఇస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ విషయమై జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషాను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కడపలో మీటింగ్ ఉండడం వల్లతాను వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆస్పత్రిలో 15 మంది డాక్టర్లలో పది మంది ఉన్నారని కొందరు డాక్టర్లు సెలవుపై వెళ్లారని తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు నమూనా పరీక్ష

ప్రొద్దుటూరు ,మే 3 (ఆంధ్రజ్యోతి) : లా కోర్సు చదివి జూనియర్ న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న వారికి ఇండియన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు నమూనా పరీక్షను ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు కోర్టు ఆవరణలోని బార్ అసోషియేషన్ హాల్లో ఈ నమూనా పరీక్షను నిర్వహించారు. దాదాపు 15 మంది న్యాయవాదులు ఈ పరీక్షకు హాజర య్యారు. ఈ కార్యక్రమంను రిటైర్డ్ జిల్లా జడ్జి ఇస్మాయిల్ సెషన్స్ కోర్టు అదనపు న్యాయవాది బండెల ఓబులేసు, బార్‌అసోషియేషన్ పట్టణ అధ్యక్షుడు రామచంద్ర కార్యదర్శి చంద్రశేఖర్ లు నిర్వహించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు

ముద్దనూరు మే3(ఆంధ్రజ్యోతి):ప్రైవేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో విద్యార్థులకు ఉచిత అడ్మిషన్లుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో నాగే శ్వరనాయక్ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగుల, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల, బీసీ, మైనారిటీ, బలహీన వర్గాల వారు అర్హులన్నారు. రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు మే15లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

బి.మఠం ఎస్‌ఐగా శివప్రసాద్ బాధ్యతలు స్వీకరణ



బ్రహ్మంగారిమఠం, మే 3 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి మఠం ఎస్‌ఐగా శనివారం బి.శివప్రసాద్ బాధ్యతలను చేపట్టారు. ఈయన ఒంటిమిట్ట నుంచి బదిలీపై బి.మఠంకు రావడం జరిగింది. బి.మఠంలో పనిచేస్తున్న జె.చంద్రశేఖర్ బదిలీపై కడపకు వెళ్లారు.

లక్ష్మినరసింహుడికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం అనంతరం పలురకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పూజారి పెంచలయ్యస్వామి మాట్లాడుతూ 11వతేదీ నుంచి 13వతేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటిరోజు స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకుని అభిషేకాలు, రెండోరోజు స్వామివారి తిరుకల్యాణం మహోత్సవం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలి

పోరుమామిళ్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు గంగయ్య అన్నారు. శనివారం పోరుమామిళ్ల గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆంగ్లభాషపై శిక్షణ ఇచ్చారు. వారంరోజులు గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, గుడ్‌హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ ఇస్తామన్నారు. గ్రంథాలయ అధికారి అఫ్రిద్, దాదాపీర్, రిటైర్డ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో మార్కారెడ్డి పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ఖాజీపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేయడంతో ఆమేరకు ఎంపీడీవో వెంకటరమణ, ఏపీడీ సుబ్బారెడ్డి, ఏపీవో చంద్రశేఖర్‌లు శనివారం విచారణ చేపట్టారు. మండల పరిధిలోని త్రిపురవరం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టిన కొద్దిసేపటికే ఫిర్యాదుదారులపై ఫీల్డ్ అసిస్టెంట్ ఘర్షణకు దిగడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చనిపోయినవారికి, పనులకు పోనివారికి హాజరు వేసుకుని అక్రమాలకు పాల్పడ్డారని విచారణ జరిగితే బయటపడుతాయని అధికారులను అడ్డుకోవడంతోపాటు ఫిర్యాదుదారులపై కూడా ఘర్షణకు వస్తున్నారని అన్నారు. ఇలా అక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎండీవో మాట్లాడుతూ ఘర్షణకు దిగడంతో మరోసారి విచారణ చేపడుతామని అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ సార్వత్రిక సమ్మె


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

బద్వేలు, మే 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20, 21, 22 తేదీలలో సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. ఆ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆప్కాస్ సంస్థను రద్దు చేసి ప్రైవేటు ఏజన్సీలకు కార్మికులను అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయం ఉప సంహరించుకోవాలన్నారు. జీవో 36 ప్రకారం జీతాలు పెంచడంతోపాటు వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు గంటా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రొద్దుటూరు ,మే 3 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు ఆఫీసు వేళలల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని లేకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున హెచ్చరించారు. శనివారం 41,42,43 సచివాలయాలను కమిషనర్ మల్లికార్జున తనిఖీ చేశారు. 41 వ సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్న ఉద్యోగి ఉదయం సచివాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేసి వెళ్లిపోయినట్లు కమిషనర్ తనిఖీలో గుర్తించి విచారించగా ఆమె అధికారుల అనుమతి తీసుకోకుండా బయటకు వెళ్లిపోయినట్లు తేలింది.దీనిపై ఆమెను ఆఫీసులో కమిషనర్ ను కలిసి సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

జమ్మలమడుగులో ప్లాస్టిక్ నిషేధం

జమ్మలమడుగు, మే 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ వినియోగం నిషేధించినట్లు కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం సాయంత్రం జమ్మలమడుగు పాత బస్టాండులో దుకాణాల ఎదుట ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. రోజు రోజుకు జమ్మలమడుగులో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుందని, ఆదిశగా రోగాలు సైతం వస్తున్నాయని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

ఖాజీపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని రావులపల్లె ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులుగా గాలి ఉధృతి ఎక్కువగా ఉండడంతో స్తంభాలు పడిపోయి విద్యుత్తు సరఫరా లేదన్నారు. దీంతో గ్రామంలో నీటి ఎద్దడి ఉండడంతోపాటు ములబాక పైపులైను మరమ్మతులు ఉన్నట్లు తెలిసి వెంటనే గ్రామానికి మంచినీరు అందించామన్నారు. ఇందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగనాదేశ్వరకోన చైర్మన్ ఆదినారాయణరెడ్డిలు సహకరించారన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై తహసీల్దార్ విచారణ


ప్రభుత్వ స్థలాల ఆక్రమించిన వారిని విచారిస్తున్న తహసీల్దారు గంగయ్య

ప్రొద్దుటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లె పంచాయతీ అమృతనగర్‌లోని ప్రభుత్వ ఇళ్లస్థలాల ఆక్రమణలపై తహసీల్దారు గంగయ్య శనివారం విచారణ జరిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మాడిశెట్టి ప్రతాప్ అనే వ్యక్తి జనవరి 27న ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దారు గంగయ్య సుబ్బారెడ్డి అలియాస్ సుబ్రమణ్యం యాదవ్, మహానంది, జయరామ్ ఆచారిలను విచారించారు. సుబ్బారెడ్డి అనే వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కమర్షియల్ రూములు నిర్మించాడని ప్రతాప్ ఆరోపించారు. అలాగే మహానంది, జయరామ్ ఆచారిలు కూడా కొందరు వ్యక్తుల దగ్గర ప్రభుత్వ స్థలాలు అక్రమంగా కొని ఆస్థలాల్లో ఇళ్లు రూములు నిర్మించి విక్రయించి సొమ్ముచేసుకున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై తహసీల్దారు ప్రతాప్‌కు ఆ స్థలాల వివరాలు పూర్తిగా అందజేయాలని అవి ఈ ముగ్గురికి సంబంధం లేకుండా అక్రమంగా ఆక్రమించి నిర్మించి విక్రయించి ఉంటే వారిపై క్రిమినల్ కేసులకు ప్రతిపాదిస్తానని తెలిపారు. ఇరువురిని తమ వద్ద ఉన్న ఆధార పత్రాలు తేవాలని తెలిపారు.

కోతుల బెడదపై మున్సిపల్ అధికారుల చర్యలు


పట్టుకున్న కోతులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు, మే 3(ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో కోతుల బెడద పై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున చర్యలు చేపట్టారు. ఆమేరకు మే 1 తేదీ నుంచి జిల్లా ప్రభుత్వ ఆసుప త్రి, వైఎంఆర్ కాలనీ, రామేశ్వరం తదితర ప్రాంతాలలో మొత్తం 85 కోతులను పట్టారు. వాటిని మూడు రోజులుగా బోనులలో బంధించి ఆహారం నీళ్ళు అందజేశారు. ఆదివారం ఉద యం వాటిని బద్వేలు పోరుమామిళ్ల ఏరియాలోని అటవీ ప్రాంతాల్లో వదిలేందుకు వాహనా ల్లో తరలించారు. ఈ కోతుల పట్టివేతకు ఒక్కో కోతికి 450 రూపాయలు కోతులు పట్టే వారికి చెల్లించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కోతుల పట్టివేత కార్యక్రమంను శానిటరీ సూపర్‌వైజర్ నూర్‌బాషా పర్యవేక్షించారు.

చల్లా రాజగోపాల్ అన్నదాన సేవలు అభినందనీయం

● 4వ వార్షికోత్సవం సందర్భంగా చల్లాకు అభినందనలు


చల్లా రాజగోపాల్‌యాదవ్‌ను అభినందిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు చల్లా రాజగోపాల్‌యాదవ్ చేపట్టిన అన్నదాన సేవలు అభినందనీయమని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. చల్లా రాజగోపాల్‌యాదవ్ పేద ప్రజల ఆకలి తీర్చడానికి గత మూడు సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 4వ వార్షికోత్సవాన్ని పురష్కరించుకుని అన్వర్ థియేటర్ వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు చల్లాను అభినందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ పేద ప్రజల ఆకలి తీర్చడానికి చల్లా రాజగోపాల్‌యాదవ్ గత మూడు సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, 4వ సంవత్సరంలో కూడా ఆయన అన్నదాన కార్యక్రమం కొనసాగాలని తెలుగుదేశం పార్టీ ఆయనకు అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, ఎమ్మెల్యే సోదరుడు ఆనంద భార్గవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మహమ్మద్‌గౌస్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అడిషనల్ సెక్రటరి జనరల్ వెంకటకృష్ణయ్యయాదవ్, చల్లా రవి, నల్లం రవిశంకర్, శ్రీనివాసులు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

25 లోగా మైనారిటీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

కొండాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ, క్రిస్టియన్ రుణాలకు ఈ నెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. మైనారిటీలకు రూ.ఒక లక్ష నుంచి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్ మైనారిటీలకు రూ.5 లక్షల వరకు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి 50 శాతం సబ్సిడీ మంజూరవుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలి

● జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయజ్యోతి

బద్వేలు, మే 3 (ఆంధ్రజ్యోతి): విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ తప్పుదారి పట్టిస్తున్న ఎన్‌డీఏకు వ్యతిరేకంగా 40 రోజులు జాతీయ, రాష్ట్ర , నియోజకవర్గ మండల స్థాయిలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అందులో భాగంగా బద్వేలు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నరసింహ, డీసీసీ జనరల్ సెక్రటరీ అచ్యుతరాజు, పీసీసీ సభ్యుడు డాక్టర్ అన్వర్, మండల అధ్యక్షులు అంబవరం సుధాకర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, షామీర్, గోపవరం , అట్లూరు మండలాల నాయకులు సాంబయ్య, గంగయ్య పాల్గొన్నారు

మైదుకూరును ఆదర్శ మున్సిపాలిటీ చేద్దాం

మైదుకూరు రూరల్ ,మే 3(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పార్వతీనగర్,19వ వార్డులో శనివారం ఎమ్మెల్యే పుట్టా సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం భూమి పూజ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎక్కడ మట్టి రోడ్లు కనిపించకుండా సీసీ రోడ్లు నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ఏపీ రవీంద్ర, ఆకుల క్రిష్ణయ్య ,దనపాల జగన్, కొండపల్లి ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు మృతి

జమ్మలమడుగు, మే 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఈడిగపేట దొరసానిచేను వీధి సమీపంలో సిద్ధంరెడ్డి రామలక్షుమ్మ అనే వృద్ధ మహిళ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి వద్దనే ఉన్నట్లుండి పడిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. మృతురాలికి నలుగురు సంతానం. అనంతరం అర్బన్ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

6, 7 తేదీల్లో ఆన్‌లైన్ మోడల్ ఎంసెట్ పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎంసెట్ పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థుల కోసం ఈనెల 6, 7 తేదీల్లో ఆన్‌లైన్‌లో మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌లు తెలిపారు. మోడల్ ఎంసెట్ పరీక్ష పోస్టర్లను శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ ఎంసెట్ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని, ప్రముఖ విద్యావేత్తల చేతుల మీదుగా మోడల్ ఎంసెట్ పరీక్ష ప్రశ్నాపత్రాలను రూపొందించడం జరిగిందన్నారు. 6, 7 తేదీల్లో పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తామని, ఎంసెట్ పరీక్షకు సన్నద్ధమయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అబినయ్, ఎంసెట్ విద్యార్థులు పాల్గొన్నారు.